మహిళలు పురోగతి సాధిస్తున్నా భద్రత ప్రశ్నార్థకమే?

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చిన్న వయసు నుంచే మగవారికి మహిళల భద్రతపై అవగాహన కల్పించాలని నటి రేవతి సూచించారు. భారత్ సోగో కక్కాయ్ ట్రస్ట్ తరఫున చెన్నై మ్యూజిక్ అకాడమీలో ఆదివారం మహిళా సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అతిథులుగా రేవతి, పరాశక్తి హౌసింగ్ ఫైనాన్స్ డైరెక్టర్ కల్పనా శంకర్ తదితరులు పాల్గొన్నారు. రేవతి మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు పురోగతి, విజయాలు సాధించినా వారికి భద్రత ఇప్పటికీ ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఆర్థికశాస్త్రం, అంతరిక్ష పరిశోధన వంటి వివిధ రంగాల్లో మహిళలు పురోగమిస్తున్నారని, అయినా విద్యావంతులైన కుటుంబాల్లో గృహహింస కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు.

మాట్లాడుతున్న నటి రేవతి, చిత్రంలో కల్పనా శంకర్

12 జిల్లాలకు ఏఎస్పీల నియామకం

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురై, తిరునెల్వేలి మొదలైన 12 జిల్లాలకు 15 మంది ఏఎస్పీ(అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్)లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు తూత్తుకుడి రూరల్ ఏఎస్పీగా అంజిత్ ఎ.నాయర్, తంజావూర్ జిల్లా పట్టుకోట్టై ఏఎస్పీగా అంకిత, నామక్కల్ జిల్లా తిరుచ్చెంగోడుకి అశ్విని, తిరునెల్వేలికి విశ్వజిత్ పాండా, కడలూరు జిల్లా చిదంబరానికి సత్యప్రియ కవిన్ డీజే, తిరుచ్చి జిల్లా తిరువెరుంబూర్‌కి ఇన్బ, దిండుక్కల్‌కు మంజిమా, నామక్కల్ జిల్లా రాశిపురానికి మన్నం సుజిత్ సంపత్, తూత్తుకుడి జిల్లా కోవిల్పట్టికి నీల్ శర్మ, రామనాథపురానికి నేహా, నాగపట్టినం ప్రియంకా భార్గవ్, తిరువణ్ణామలై రాహుల్ వి గోపాల్, విరుదునగర్ జిల్లా రాజపాళెయం సైందనే స్వప్నిల అనిల్, మదురై జిల్లా ఊమచ్చికుళం తను సింగ్ నియమితులయ్యారు. శివగంగై జిల్లా కారైక్కుడి ఏఎస్పీగా ఉన్న ఆశిష్ పునియా ప్రస్తుతం మదురై జిల్లా అన్నానగర్‌కి బదిలీ అయ్యారు.

తూత్తుకుడిలో థర్మల్ విద్యుత్ కేంద్రం

- పాల సేకరణ ధర పెంపు
- శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ ప్రకటన

సైదాపేట, న్యూస్‌టుడే: పాల సేకరణ ధర పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ ప్రకటించారు. పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి కూడా పలు ప్రకటనలు చేశారు. సోమవారం ఆయన శాసనసభలో ప్రసంగించారు. పాడి ఆవుల మేత, ఇతర ముడి పదార్థాల ధరల పెరుగుదల, రైతుల కోరిక మేరకు పాల సేకరణ ధరను లీటరుకు రూ.41 నుంచి 44కి పెంచుతున్నట్లు పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వంపై నెలకు రూ. 60 కోట్ల భారం పడనుందన్నారు.

■ కాంచీపురం జిల్లా మధురాంతకం వద్ద సిప్కాట్ ద్వారా రూ.175 కోట్లతో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.2 వేల కోట్ల పెట్టుబడికి అవకాశం ఉందని, 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అన్నారు.

■ 196 కొత్త విద్యుత్తు ఉపకేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 15 వేల కి.మీ మేర కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయటంతో పాటు ప్రస్తుతం ఉన్న లైన్లను పటిష్ఠం చేస్తామని ప్రకటించారు. విద్యుత్ పంపిణీ సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు కూడా తెలిపారు.

■ తూత్తుకుడిలో కొత్త సూపర్‌క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందులో 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు ఉంటాయన్నారు. వాటిని రూ.20,800 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

■ తిరుచ్చి జోన్‌లో బహుళ టెర్మినల్ సరకు రవాణా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. దీనిని టిడ్కో ద్వారా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. టిడ్కో ద్వారా కోయంబత్తూర్‌లో రూ.400 కోట్లతో డిజిటల్ ఫైనాన్స్ హబ్ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.

ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి విజయ్

దివ్యాంగులకు ఎలక్ట్రిక్ వాహనాలు..

మంత్రి జగదీశ్వరి

దివ్యాంగ సంక్షేమశాఖ తరఫున అసెంబ్లీలో ఆ శాఖ మంత్రి జగదీశ్వరి 9 కొత్త ప్రకటనలు చేశారు. దివ్యాంగులకు కొత్త ఎలక్ట్రిక్ వాహనాలు, మానసిక వికలాంగులకు 10 హోమ్‌లు, మేధో వైకల్యం ఉన్న వారికి 10 వృత్తి శిక్షణా కేంద్రాలు, వెన్నెముక బాధితుల కోసం రెండు గృహాలు, దివ్యాంగుల పిల్లలకు శిక్షణ కేంద్రాలు, దివ్యాంగుల కోసం కడలూరులో 2 వసతి గృహాలు, దివ్యాంగులకు ఉచిత ప్రయాణం, వినికిడి లోపం ఉన్న వారికి వర్చువల్ లెర్నింగ్, దృష్టి లోపం ఉండే విద్యార్థులకు చదవటంలో సాయపడే రీడర్లకు భత్యం పెంచనున్నట్లు తెలిపారు.

శుభ్రతా దేవతలు..

శుభ్రతా కార్మికులపై ఎలాంటి అణచివేత చర్యలకు పాల్పడకూడదని పోలీసుశాఖకు సూచించినట్లు మంత్రి రాజ్‌మోహన్ తెలిపారు. వారు పారిశుద్ధ్య కార్మికులు కాదని శుభ్రతా దేవతలని తెలిపారు. శుభ్రతా కార్మికులకు మరుగుదొడ్డి, దుస్తులు మార్చుకునే సౌకర్యాలు సెప్టెంబరు 15 లోపు కల్పిస్తామని చెప్పారు.

రాజ్‌మోహన్

ప్రభుత్వానికి సహకరించని 'స్థానిక' ప్రతినిధులు..

ఆదవ్ అర్జున

చెన్నై మేయర్ ప్రియ ప్రభుత్వానికి సహకరించటం లేదని ప్రజాపనులశాఖ మంత్రి ఆదవ్ అర్జున తెలిపారు. రూ.5 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసినా అమలు చేయటం కుదరలేదన్నారు. స్థానిక సంస్థలు డీఎంకే నియంత్రణలో ఉండటమే అందుకు కారణమని చెప్పారు. 25 కార్పొరేషన్లలో డీఎంకే పాలకులే ఉన్నారన్నారు. మేయర్లు, స్థానిక ప్రతినిధులు టీవీకే ప్రభుత్వానికి సహకరించటం లేదని ఆరోపించారు. చెమ్మంచేరి గ్లోబల్ స్పోర్ట్స్ సిటీ పథకం రద్దుకు సంబంధించి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించగా దానిని రద్దు చేయలేదని పునరుద్ధరిస్తున్నామని మంత్రి బదులిచ్చారు. నేపాల్ వరదలపై మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు తమిళనాడుకు చెందిన 305 మంది మానసరోవర్ యాత్రకు వెళ్లారని, వారిలో 221 మంది సురక్షితంగా ఉన్నారని, 84 మంది ఆచూకీ తెలియలేదని చెప్పారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు తొలగింపు.. గురువారం అసెంబ్లీ సమావేశంలో చోళవందాన్ ఎమ్మెల్యే కరుప్పయ్య జల్లికట్టుపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వ్యాఖ్యలను సభాపతి జేసీడీ ప్రభాకర్ రికార్డుల నుంచి తొలగించారు.

బస్సుల సంఖ్య పెంచాలి..

పీఎంకే ఎమ్మెల్యే సౌమ్య అన్బుమణి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రస్తుత టీవీకే విస్తరించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంతాలకు తగినన్ని బస్సులు నడపటం లేదన్నారు. సాధారణ, మినీ బస్సుల సంఖ్య పెంచాలని కోరారు.

సౌమ్యా అన్బుమణి

సభకు వస్తున్న ప్రతిపక్షనేత ఉదయనిధి, డీఎంకే ఎమ్మెల్యేలు

పేదలకు నాణ్యమైన బియ్యం

- రేషన్ షాపుల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు
- నవంబరు నుంచి అమల్లోకి
- రాష్ట్రవ్యాప్తంగా భారీగా ధాన్యం సేకరణ

రాష్ట్రంలోని పేదలకు రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు కీలక సంకేతాలు వచ్చాయి. ఇందులో భాగంగానే గత ఆర్థిక సంవత్సరంలో నాణ్యమైన బియ్యం రకాల్ని భారీగా సేకరించింది. ప్రభుత్వ తాజా అంచనాల ప్రకారం.. అంతకుముందుతో పోల్చితే ఈసారి నాణ్యమైన బియ్యం 60శాతం ఎక్కువగా సేకరించినట్లు వెల్లడవుతోంది. నవంబరు నుంచి చౌక దుకాణాల ద్వారా అందించేలా చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. **- ఈనాడు-చెన్నై**

గతంకన్నా మెరుగ్గా..

2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా 64.2లక్షల మెట్రిక్ టన్నుల్ని సేకరించారు. అంతకుముందు 2024-25లో ఆ పరిమాణం 47.98లక్షల మెట్రిక్‌టన్నులే. ఈసారి 16.22లక్షల మెట్రిక్‌టన్నుల్ని అధికంగా సేకరించి నిల్వ ఉంచారు. తమిళనాడు పౌరసరఫరాల సంస్థ(టీఎన్‌సీఎస్‌సీ), అనుబంధంగా ఉన్న భారత జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య (ఎన్‌సీసీఎఫ్) ద్వారా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తరఫున రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతల నుంచి ధాన్యాన్ని సేకరించారు.

దాదాపు రెట్టింపు నిల్వలతో..

పేదలకు ఇచ్చేందుకు అవసరమైన బియ్యం కన్నా అధికంగా రాష్ట్రంలో నిల్వ ఉన్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు వివరిస్తున్నారు. అదనపు బియాన్ని భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరచనున్నట్లు వెల్లడిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వంపై కొనుగోలు భారం తగ్గుతుందని చెబుతున్నారు. బియ్యాన్ని నిల్వ ఉంచే ఎఫ్‌సీఐకి ప్రజలకు సరఫరా చేసేందుకు నెలకు 2.78లక్షల మెట్రిక్ టన్నులు అవసరం. అలా ఏడాదికి 33.36 లక్షల టన్నులు కావాలి. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 30.84లక్షల టన్నుల్ని సేకరించి ఇచ్చింది. తద్వారా నిల్వలు భారీగా పెరిగాయి.

మరింత ప్రోత్సాహకాలిచ్చి..

■ 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సెప్టెంబరు 1 నుంచి సేకరణ ప్రక్రియ మొదలుపెడుతున్నారు. సవరించిన కనీస మద్దతు ధర ఆధారంగా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆ ధరలు సెప్టెంబరు 1నుంచే అమల్లోకి వస్తున్నాయి. ■ ఈసారి సేకరించే ధాన్యానికి ప్రభుత్వం ప్రోత్సాహకాల్ని పెంచింది. మేలు రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 156 నుంచి రూ.289కి, సాధారణ రకానికి రూ.131 నుంచి రూ.159గా చేశారు. ఫలితంగా మేలురకం ధాన్యం క్వింటాలు ధర రూ.2,750 పలకబోతుండగా, సాధారణ రకం రూ.2,600గా ఉండనున్నట్లు స్పష్టత వస్తోంది. ■ గతసారి కనీస మద్దతు ధర కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినా ఆశించిన నిర్ణయం రాలేదు. రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు ప్రోత్సాహకాల్ని అప్పట్లో ఇచ్చింది. ■ రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణలోనూ మెరుగైన ఫలితాలు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. మద్దతు ధర పెరగడం, పొలాలకు సకాలంలో నీరు అందడం ప్రధానంగా కనిపిస్తున్నాయని చెప్పారు. వాతావరణ పరిస్థితులు సైతం అనుకూలించడంతో పంట విస్తీర్ణం పెరిగిందని చెబుతున్నారు.

ఈసారి ఎల్‌నినో ప్రభావం..

ఎల్‌నినో ప్రభావం, నీరు సరిగా లేకపోవడంలాంటి సమస్యలు ఈసారి రాష్ట్ర రైతుల్ని వేధించాయి. సుమారు 11 జిల్లాలపై ఎల్‌నినో ప్రభావం బాగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2026-27కు వరి విస్తీర్ణం తగ్గిందని, ఈసారి 42.44 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు పౌర సరఫరాల కోసం సేకరించవచ్చని భావిస్తున్నట్లు అధికారులు వివరించారు.

సెప్టెంబరు 16 నుంచి 18 వరకు
ఐఐటీఎంలో జాతీయ కార్యశాల

వడపళని, న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్‌లోని వధ్వాని స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఏఐ(డబ్ల్యూఎస్ఏఐ), సెంటర్ ఫర్ ఔట్ రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్(సీఓడీఈ) సంయుక్తంగా సిస్టమ్ బయాలజీ, మెటబాలిక్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రెయింట్ బేస్డ్ మోడలింగ్‌పై జాతీయ కార్యశాల నిర్వహిస్తున్నాయి. మూడురోజుల పాటు జరిగే కార్యశాలలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొనేందుకు ఉపన్యాసాలు, హ్యాండ్స్ ఆన్ శిక్షణ అందించనున్నట్లు ఐఐటీఎం సోమవారం ప్రకటనలో పేర్కొంది. సెప్టెంబరు 4వ తేదీలోగా ప్రత్యేక లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు ఐఐటీఎం ప్రాంగణంలో జరగనున్న కార్యశాలలో తరగతి గది ఉపన్యాసాలతో పాటు హ్యాండ్స్ ఆన్ సెషన్స్ కూడా ఉంటాయి. జీవశాస్త్రం, మెటబాలిక్ మోడలింగ్‌లో ఆసక్తి ఉన్న తుది సంవత్సరం యూజీ విద్యార్థులు, పీజీ చదువుతున్న వారు, పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణుల కోసం కార్యశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఐఐటీఎం పేర్కొంది. ఆసక్తి గల అభ్యర్థులు events@dsai.iitm.ac.in మెయిల్‌ను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

విశ్రాంత న్యాయమూర్తి జాడ తెలుసుకోవాలని సుప్రీంకోర్టు సీజేకి తమిళ లాయర్ల సంఘం లేఖ

ప్యారిస్, న్యూస్‌టుడే: నేపాల్ వరదల్లో కనిపించకుండా పోయిన మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శివజ్ఞానంను రక్షించేందుకు సహాయపడాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి దిల్లీ తమిళ లాయర్ల సంఘం లేఖ రాసింది. జస్టిస్ శివజ్ఞానం భారత న్యాయవ్యవస్థలో దాదాపు 34 ఏళ్ల సేవలు అందించారన్నారు. జస్టిస్ శివజ్ఞానం తమిళ యాత్రికుల బృందంతో నేపాల్‌లో పర్యటించారని, గతనెల 26వ తేదీ భార్యకు వాట్సప్ కాల్ చేశారని, ఆ తర్వాత ఎలాంటి సమాచారం లేదన్నారు. ఆయన ఎక్కడున్నారనే విషయమై కుటుంబ సభ్యులు, తమ సంఘం తీవ్ర ఆవేదన చెందుతోందన్నారు. ఆయన్ను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కోరారు.

జస్టిస్ శివజ్ఞానం

నేపాల్ బాధితుల కోసం వెళ్లే వారికి
సాయం అందించేందుకు ప్రత్యేకబృందం

ప్యారిస్, న్యూస్‌టుడే: నేపాల్ వరదల్లో చిక్కుకుని కనిపించకుండా పోయిన వారి వివరాలు తెలుసుకునేందుకు అక్కడికి వెళ్లే బంధువులకు సహాయపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎ.సత్యశివం(మొబైల్ నెం. 98682 07295), పి.దినేష్ కణ్ణన్(98685 30799), ఎస్.అజయ్(98682 24049) కాఠ్‌మాండూలో ఉండి అవసరమైన సహాయాలు చేపడతారని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు తమిళనాడుకు చెందిన 21 మంది పర్యాటకులను రక్షించి సొంతూళ్లకు పంపినట్లు, 84 మంది వివరాల కోసం గాలిస్తున్నట్లు పేర్కొంది. బాధితుల వివరాలను తెలుసుకునేందుకు దిల్లీలో ఉన్న తమిళనాడు హోం కంట్రోల్ రూం 92895 16712(వాట్సప్, ఫోన్), 98685 30776 మొబైల్ నెంబర్లు సంప్రదించాలని సూచించింది.

మావారి ఆచూకీ తెలియజేయండి

- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత
- వరదల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి గల్లంతు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: నేపాల్ వరదల్లో గల్లంతైన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి గురించి ఎలాంటి సమాచారం అందలేదని కుటుంబసభ్యులు తేని జిల్లా కలెక్టర్ వైతినాథన్‌కు వినతిపత్రం సమర్పించారు. కోడంగిపట్టికి చెందిన సెల్వం, భార్య చిత్రాదేవి, తల్లి సరస్వతి గతనెల 14న 49 మందితో కూడిన బృందంలో నేపాల్‌కి ఆధ్యాత్మికయాత్రకు వెళ్లారు. వరదల్లో ముగ్గురూ గల్లంతయ్యారు. తమవారిని గుర్తించి సురక్షితంగా తిరిగి అప్పగించాలని గతనెల 27 వినతిపత్రం ఇచ్చామని, ఆరు రోజులు గడిచినా ఎలాంటి వివరాలు రాకపోవడంతో మళ్లీ అందించినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న తేని కలెక్టర్ వైతినాథన్

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

మత్తుపదార్థాలతో అనర్థాలు

గిండి, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలతో అనర్థాలు వాటిల్లుతాయని, వాటి జోలికి వెళ్లొద్దని జమాతే ఇస్లామి హింద్ తరఫున అవగాహన కల్పించారు. చెన్నై ఎగ్మోర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ మానవహారం నిర్వహించారు. మత్తు పదార్థాల రహిత తమిళనాడు సాధనకు అందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. గతనెల 15 నుంచి 30 వరకు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టినట్లు సోమవారం సంస్థ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా అంగీకరించకపోతే పదవులు వదులుకుంటాం

ప్యారిస్, న్యూస్‌టుడే: రాహుల్‌గాంధీని ప్రధాని అభ్యర్థిగా టీవీకే అంగీకరించకపోతే పదవులు వదులుకుంటామని కాంగ్రెస్ మంత్రి రాజేష్‌కుమార్ తెలిపారు. కన్నియాకుమరిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2029 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ ప్రధాని అవుతారన్నారు. టీవీకే అందుకు సహకరించకపోతే కాంగ్రెస్‌కి చెందిన ఇద్దరు మంత్రులు పదవిలో కొనసాగరని తెలిపారు. ఒక్కో పార్టీకి ఒక్కో అభిప్రాయం, సిద్ధాంతం ఉంటాయన్నారు. కాంగ్రెస్‌కి చెందిన చివరి కార్యకర్త వరకు రాహుల్ ప్రధాని కావాలని ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి రాజేష్‌కుమార్

టీవీకేపై ఇళంగోవన్ విమర్శలు

సైదాపేట: కాంగ్రెస్ నుంచి ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌గాంధీ ఉండగా టీవీకే నుంచి జోసెఫ్ విజయ్ ఎలా అభ్యర్థిగా ముందుకొస్తారని డీఎంకే అధికార ప్రతినిధి టి.కె.ఎస్.ఇళంగోవన్ వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండటాన్ని మద్దతిచ్చారని, కాంగ్రెస్‌కి చాలాఏళ్లు దేశాన్ని పాలించిన అనుభవముందని తెలిపారు. ఉన్నత పదవికి టీవీకే అభ్యర్థిని ప్రకటించడంపై ఆయన విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి అభ్యర్థిత్వంపై జరిగిన సర్వే లోపభూయిష్టంగా ఉందన్నారు. అసెంబ్లీలో పాల సేకరణ ధరను రూ.44కు పెంచారని, తద్వారా ప్రజలపై భారం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కావేరి జలాల విడుదలకు తమిళనాడు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్యారిస్, న్యూస్‌టుడే: కావేరి నీటి వ్యవహారమై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనంలో మంగళవారం విచారణకు వచ్చింది. సుప్రీంకోర్టు సూచనల మేరకు అదనపు నీటిని విడుదల చేయాలని కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీలో విన్నవించగా నిరాకరించినట్లు తమిళనాడు ప్రభుత్వం తరఫున తెలిపారు. తమిళనాడుకి 9 వేల క్యూసెక్కుల చొప్పున 15 రోజులకు విడుదల చేయాలని కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఉత్తర్వులు ఇచ్చిందని, వాటిని కర్ణాటక ప్రభుత్వం పూర్తిగా అమలుచేయలేదని వాదించారు. కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ జారీచేసిన ఉత్తర్వుల మేరకు నీటిని విడుదల చేసినట్లు, ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్ర కరవు నెలకొనడంతో అధిక నీటిని విడుదల చేయని పరిస్థితి నెలకొందని కర్ణాటక ప్రభుత్వం తరఫున తెలిపారు. నీటిని విడుదల చేయకపోవడంతో సుమారు 24 లక్షల ఎకరాలకు పైగా సాగు దెబ్బతింటోందని, కర్ణాటక 20 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించి వ్యవసాయానికి ఉపయోగించిందని, అక్కడి జలాశయాల్లో సుమారు 73 టీఎంసీలు నిల్వ ఉన్నా ఇచ్చేందుకు నిరాకరిస్తోందని తమిళనాడు తరఫున వాదనలు వినిపించారు. ఇరు తరఫు వాదనలు విన్న న్యాయమూర్తులు విచారణ సెప్టెంబరు 15వ తేదీకి వాయిదా వేశారు.

చెన్నై తిరువల్లిక్కేణి పార్థసారథి ఆలయంలో మొబైల్ ఫోన్ డిపాజిట్ కేంద్రం

మైలాపూర్ కపాలీశ్వర ఆలయంలో..

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి(సెప్టెంబరు 1వ తేదీ) ప్రధాన ఆలయాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడానికి నిషేధం విధించారు. ఆలయాల వద్ద ప్రత్యేక కేంద్రాల్లో రూ.5 రుసుము చెల్లించి భద్రపరిచి తర్వాత రసీదు చూపించి తీసుకెళ్లొచ్చని హిందూ దేవాదాయశాఖ ప్రకటించింది. **-వేళచ్చేరి, న్యూస్‌టుడే**

సెల్‌ఫోన్ నిషేధంపై ఏర్పాటుచేసిన బ్యానర్

కాంచీపురం పట్టణాభివృద్ధి పథకాన్ని రద్దు చేసిన ప్రభుత్వం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం పట్టణాభివృద్ధి పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. చెన్నై, పరిసర ప్రాంతాల అభివృద్ధికి డీఎంకే ప్రభుత్వ హయాంలో పుదునగర్ పథకాన్ని అమలు చేశారు. ఇందులో భాగంగా కాంచీపురం, తిరుముల్లైవాయల్, మీంజూర్, తిరువళ్లూర్, మరైమలైనగర్, శ్రీపెరుంబుదూర్‌కు కొత్త నగరాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశారు. అనంతరం సీఎండీఏ తరఫున ఈ ప్రాజెక్టులు చేపట్టేందుకు నివేదికలు కూడా తయారయ్యాయి. ఈ స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని రద్దు చేసింది. 62.78 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న 18 గ్రామాలకు సంబంధించి 2023లో ప్రచురించిన గెజెట్‌ను రద్దుచేసి కొత్తది జారీ చేసింది.

వైభవంగా ఆలయ మహాకుంభాభిషేకం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా కుమరకోయిల్‌లో ప్రసిద్ధ శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. ఈ క్షేత్రంలో సోమవారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగ పూజలు జరిగాయి. పవిత్ర జలాలున్న కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ గోపుర కలశాలపై పోసి కుంభాభిషేకం జరిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు.

కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

(c) eenadu

100 రోజుల్లో రూ.28 వేల కోట్ల అప్పు: ఈపీఎస్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: టీవీకే ప్రభుత్వం వడ్డీల కోసమే అప్పులు చేస్తోందని ప్రధాన ప్రతిపక్ష కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. రాణిపేట్టై జిల్లా ఆర్కాట్‌కి చెందిన అన్నాడీఎంకే నగర కార్యదర్శి జిమ్ శంకర్ వివాహ వేడుకలో పాల్గొనేందుకు శనివారం రాత్రి ఆయన వేలూర్ వెళ్లారు. తర్వాత ఓ ప్రైవేటు హోటల్‌లో విలేకరులతో సమావేశమయ్యారు. టీవీకే ఎన్నికల సమయంలో చేసిన పెద్ద హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రూ.28 వేల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి కమిటీని ఏర్పాటు చేశారని, గత ప్రభుత్వం కూడా ఆర్థిక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కమిటీని ఏర్పాటు చేసిన తర్వాత రూ.5 లక్షల కోట్ల రుణం తీసుకున్నారన్నారు. టీవీకే ప్రభుత్వం అప్పుల కోసమే, ఒకవేళ కొనసాగితే రూ.20 లక్షల కోట్ల రుణం పెరుగుతుందని పేర్కొన్నారు.

స్తంభించిన నేత కార్మికుల జీవనోపాధి

తిరుత్తణి, న్యూస్‌టుడే: రేషన్ షాపుల్లో అందించే బియ్యాన్ని మేకలు, ఆవుల మేతగా వాడుతున్నారని మంత్రి సెంగోట్టైయన్ పేర్కొనడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం తెలిపారు. లక్షలాది మంది ప్రజలు ఆ బియ్యాన్ని ఆహారంగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. తిరుత్తణి సమీప కె.జి.కండిగైలో సీపీఎం ప్రజాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీవీకే ప్రభుత్వం చీర, ధోవతుల తయారీకి నేత కార్మికులకు ఇంకా నూలు అందించకపోవడంతో వారి జీవనోపాధి స్తంభించిపోయిందన్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వి.అంజన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పి.షణ్ముగం

కల్లు నిషేధం న్యాయమని నిరూపిస్తే కారు బహుమానం

రైతు సంఘాల సమాఖ్య



నల్లసామి

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: మంత్రులు, ఎమ్మెల్యేలు కల్లు నిషేధం న్యాయమైందని నిరూపిస్తే ఖరీదైన కారును బహుమతిగా ఇస్తామని రైతు సంఘాల సమాఖ్య కార్యదర్శి నల్లసామి తెలిపారు. చెన్నై చేపాక్కంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ... తమిళనాడులో కల్లుపై నిషేధం న్యాయమైందేనని మంత్రులు, ఎమ్మెల్యేలు నిరూపిస్తే ఖరీదైన కారును బహుమతిగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం తన మద్యం విధానాన్ని మార్చుకోవాలని, ఉచిత సబ్సిడీ, రుణమాఫీ, బీమా ఉపశమనం, ఆదాయపు పన్ను మినహాయింపు వంటి రాయితీలను తాము ఆశించలేదని చెప్పారు. తమకు ఆత్మగౌరవం అవసరం అని, మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామని, మంచి వార్త వస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

ఊటీలో ఎలుగుబంటి సంచారం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని కోళిప్పెళ్ల గ్రామంలోకి అర్ధరాత్రి ఓ ఎలుగుబంటి చొరబడింది. వీధుల్లో కుక్కలు మొరుగుతున్న శబ్దం విని ప్రజలు కిటికీల ద్వారా బయటికి చూసి భయాందోళనకు గురయ్యారు. ఎలుగుబంటి తిరుగుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో వైరలవుతున్న నేపథ్యంలో దానిని పట్టుకోవడానికి అటవీ శాఖ వారు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య తిరుగుతున్న ఎలుగుబంటి

21 ప్రభుత్వ టెండర్లు రద్దు

'అరప్పోర్ ఇయక్కం' వల్ల నిర్ణయం

- న్యూస్‌టుడే, వడపళని

అవినీతి వ్యతిరేక సంస్థ 'అరప్పోర్ ఇయక్కం' అవకతవకలను ఎత్తి చూపడంతో రాష్ట్ర ప్రభుత్వం 21 హైవేల టెండర్లను రద్దు చేసింది. నియంత్రిత టెండర్ల ప్రక్రియ, సాంకేతిక సహాయకులను నియమించాల్సిన అవసరాన్ని కూడా ఇయక్కం ప్రస్తావించింది. ఒక్కొక్కటి సుమారుగా రూ.10 లక్షల విలువైన టెండర్లను, బహిరంగ ఆన్‌లైన్ బిడ్డుకు బదులుగా పరిమిత టెండర్లుగా జారీ చేయడం, పాల్గొనేవారిని కూడా పరిమితం చేయడం వెనుక ఉన్న హేతుబద్ధతను అరప్పోర్ ఇయక్కం ప్రశ్నించింది. కావున టెండర్లను రద్దు చేసి, ప్రతిపాదిత సాంకేతిక నియామకాల అవసరాన్ని ముందుగా నిర్ధారించాలని ఇయక్కం ప్రభుత్వాన్ని కోరింది. పదే పదే పరిమిత టెండర్లను ఎందుకు జారీ చేస్తున్నారని కూడా ప్రశ్నించింది. ఈ నియంత్రిత ప్రక్రియ వల్ల, శాశ్వతమైన ఇంజినీర్లకు అనుకూలమైన కాంట్రాక్టర్లు మాత్రమే పాల్గొనేందుకు వీలవుతుందని కూడా ఆరోపించింది.

అదనపు సాంకేతిక సిబ్బంది అవసరం

చెన్నై మహానగరంలోని రోడ్ల డివిజన్ 1, 2లో ప్రస్తుతం ఉన్న సిబ్బందిని ఉటంకిస్తూ, అదనపు సాంకేతిక సిబ్బంది అవసరం కూడా ఉందని ప్రభుత్వానికి సూచించింది. సంస్థ పేర్కొన్న మేరకు డివిజన్-1లో తొమ్మిది మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, నలుగురు అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్లు, ఒక డివిజనల్ ఇంజినీర్, ఎనిమిది మంది డ్రాఫ్ట్స్‌మెన్లు ఉండగా, డివిజన్-2లో ఎనిమిది మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, నలుగురు అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్లు, ఒక డివిజనల్ ఇంజినీర్, ఎనిమిది మంది డ్రాఫ్ట్స్‌మెన్ ఉన్నారు. ఈ ఉద్యోగాలలో ఏదీ ఖాళీగా లేదని పేర్కొంది. రెండు డివిజన్లలో 27 మంది ఇంజినీర్లు, 16 మంది డ్రాఫ్ట్స్‌మెన్‌లు సహా మంజూరైన 43 సాంకేతిక పోస్టులున్నాయని, అన్నీ భర్తీ అయ్యాయని తెలిపింది.

చట్టాల్లో సవరణకు సూచన

టెండర్లను రద్దు చేయడంపై అరప్పోర్ ఇయక్కం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. అదే సమయంలో అన్ని శాఖల టెండర్లను ఓపెన్ ఆన్‌లైన్ బిడ్డింగ్ ఆహ్వానించేలా చూడాలని కోరింది. పారదర్శక బిడ్డింగ్‌ను తప్పనిసరి చేసేందుకు టెండర్ చట్టాలకు సవరణలు చేయాలని, అవకతవకలకు పాల్పడినట్టు రుజువైన ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ టెండరింగ్ విధానంలో మరింత పారదర్శకతను కోరుతామని కూడా సంస్థ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

ముల్లై పెరియార్ డ్యామ్ పటిష్టతపై అధ్యయనం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏర్పాటు చేసిన నిపుణుల బృందం మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు తేని జిల్లాలోని ముల్లై పెరియార్ ఆనకట్ట పటిష్టతపై సమగ్ర అధ్యయనం నిర్వహించనుంది. ఈ బృందం తేని జిల్లాలోని తమిళనాడు-కేరళ సరిహద్దు ప్రాంతమైన తెక్కడిలో మకాం చేయనుంది. ఈ బృందంలో ఐఐటీ-రూర్కీ ప్రొఫెసర్ ఎం.ఎల్.శర్మ సహా వివిధ రంగాలలో అనుభవం ఉన్న ఆరుగురు నిపుణులు ఉన్నారు. దీనికి నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బల్‌రాజ్ జోషి నేతృత్వం వహిస్తున్నారు. నాలుగు రోజులపాటు జరిగే అధ్యయనంలో డ్యామ్‌లోని కీలక నిర్మాణాల దృఢత్వం, నీరు లీకేజ్, వరద పరిస్థితి, నిర్వహణ పనులు, ఇప్పటికే చేపట్టిన పటిష్టత చర్యలను పరిశీలించనున్నారు.

వార్ మెమోరియల్ వద్ద 'లైట్ అండ్ సౌండ్ షో'

వడపళని, న్యూస్‌టుడే: సాయుధ దళాలు, ప్రజల మధ్య సంబంధాన్ని బలోపేతం చేసేందుకు దక్షిణ భారత ఏరియా సైనిక ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం చెన్నైలోని వార్ మెమోరియల్ వద్ద ప్రత్యేక 'లైట్ అండ్ సౌండ్ షో' జరిగింది. ప్రారంభంలో జరిగిన బహిరంగ ప్రదర్శనకు మంచి స్పందన లభించడంతో ఈ లైట్ అండ్ సౌండ్ షోను ప్రతి శనివారం ఏర్పాటు చేయనున్నట్లు రక్షణ శాఖ ఆదివారం ప్రకటనలో పేర్కొంది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు, సైనికుల కుటుంబాలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, పర్యాటకులు ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శన వీక్షించారు. యుద్ధ రంగంలో సేవల నుంచి తొలగించిన టీ55 ప్రధాన యుద్ధ ట్యాంక్, భారత నావికా దళ నౌకలు అంజాదీప్, ఐఎన్ఎస్ విక్రాంత్‌ల నమూనాలు ఆకట్టుకున్నాయి.

టీ55 యుద్ధ ట్యాంక్

డీఎంకే నుంచి వైదొలగిన తోప్పు వెంకటాచలం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: గత శాసనసభ ఎన్నికలలో ఓడిపోయిన నేపథ్యంలో తోప్పు వెంకటాచలం డీఎంకే నుంచి వైదొలగారు. ఈ మేరకు లేఖ ద్వారా పార్టీ అధ్యక్షుడు స్టాలిన్‌కి తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా, పెరుందురై నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. శాసనసభ ఎన్నికలలో తనకి, తనతో పనిచేసిన వారికి చేదు అనుభవాలు ఎదురయ్యాయని, అందువల్ల ఇకపై పార్టీలో కొనసాగడానికి మనసు అంగీకరించలేదని, కావున పార్టీ కనీస సభ్యత్వం సహా అన్ని బాధ్యతల నుంచి వైదొలగుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటన

ప్యారిస్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా వడమదురై వద్ద ఇంటి సమీపంలో ఆడుకుంటున్న పిల్లలను పాల వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు బాలికలు, ఓ బాలుడు మృతిచెందారు. ఈ నేపథ్యంలో పిల్లల మృతి వార్త విని దిగ్భ్రాంతి చెందినట్లు ముఖ్యమంత్రి సంతాప ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.3 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

వడపళని, న్యూస్‌టుడే: పలు మార్గాల్లో నడిచే వీక్లీ ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్టు దక్షిణ రైల్వే ప్రకటనలో తెలిపింది. ● **06059** తాంబరం-బోడినాయకనూర్ సెప్టెంబరు 12 నుంచి 26వ తేదీ (శని), **06060** బోడినాయకనూర్-తాంబరం సెప్టెంబరు 13 నుంచి 27 (ఆది) వరకు పొడిగించారు. ● **06045** ఎగ్మోర్-కన్నియాకుమరి సెప్టెంబరు 4 నుంచి 25 (శుక్ర), **06046** కన్నియాకుమరి-ఎగ్మోర్ సెప్టెంబరు 6 నుంచి 27 (ఆది) వరకు నడుస్తుంది. ● **06126** మంగళూరు సెంట్రల్-ఎగ్మోర్ సెప్టెంబరు 7 నుంచి 28 (సోమ), **06125** ఎగ్మోర్-మంగళూరు సెంట్రల్ సెప్టెంబరు 8 నుంచి 29వ తేదీ (మంగళ) వరకు పొడిగించారు. ● **06028** పొదనూర్-చెన్నై సెంట్రల్ సెప్టెంబరు 4 నుంచి 27 (శుక్ర, శని, ఆది), **06027** చెన్నై సెంట్రల్-పొదనూర్ సెప్టెంబరు 4 నుంచి 27 (శుక్ర, శని, ఆది) వరకు నడుస్తుంది. ● **06166** తిరునెల్వేలి-తాంబరం సెప్టెంబరు 6 నుంచి 27 (ఆది), **06165** తాంబరం-తిరునెల్వేలి సెప్టెంబరు 7 నుంచి 28 (సోమ) వరకు పొడిగించారు. ● **06070** తిరునెల్వేలి-తాంబరం సెప్టెంబర్ 3 నుంచి 24 (గురు), **06069** తాంబరం-తిరునెల్వేలి సెప్టెంబరు 4 నుంచి 26 (శుక్ర) వరకు నడుస్తుంది. ఈ రైళ్లకు రిజర్వేషన్లు అందుబాటులో ఉన్నాయి.

రామేశ్వరం జాలర్ల సమ్మె

ప్యారిస్, న్యూస్‌టుడే: శ్రీలంక జైల్లో ఉన్న తమిళనాడు జాలర్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రామేశ్వరం జాలర్లు సమ్మెకు దిగారు. రామేశ్వరం నుంచి చేపల వేటకు సముద్రానికి వెళ్లిన 29 మంది జాలర్లను సరిహద్దులు దాటి వచ్చారని ఆరోపిస్తూ శ్రీలంక నావికా దళం అరెస్టు చేసింది. అదే విధంగా జైలు శిక్ష పడిన 20 మందికి పైగా మత్స్యకారులు జైళ్లలో ఉన్నా రు. వారిని విడుదల చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రామేశ్వరం జాలర్లు ఆదివారం నిరవధిక సమ్మెకు దిగారు.

'ఇన్‌స్పైర్ మనక్' అవార్డుకు కేసరి పాఠశాల విద్యార్థులు ఎంపిక

ధ్రువీకరణపత్రాలు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం నాగుల గోపాలయ్య

వడపళని, న్యూస్‌టుడే: కేంద్రంలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్టీ)' 2025-26 సంవత్సరానికిగాను నిర్వహించిన 'ఇన్‌స్పైర్ మనక్' పోటీల్లో చెన్నై టీనగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజ్ఞానశాస్త్రంలో విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న ఆలోచనలకు గాను అవార్డుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థిని వైష్ణవి గుప్తా రూపొందించిన 'ఔషధ గుర్తింపు వ్యవస్థ(మెడిసిన్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్)', జక్కు దినేష్ రూపొందించిన 'స్వయంచాలక మార్గదర్శక వాహనం (ఆటోమేటిక్ గైడెడ్ వెహికల్)' జిల్లా స్థాయిలో ఎంపికయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఇద్దరికీ రూ.10 వేల చొప్పున నగదు బహుమతిని వారి బ్యాంకు ఖాతాలో జమ చేసిందని నాగుల గోపాలయ్య తెలిపారు. అవార్డు సాధించిన విద్యార్థులను, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు శారద, శక్తివేల్‌లను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

జనావాసంలోకి వచ్చిన వన్యప్రాణి సురక్షితం

కోయంబత్తూర్, న్యూస్‌టుడే: కోయంబత్తూర్ జిల్లా మరుదమలై వన్యప్రాణుల అభయారణ్యం పరిధిలోని దట్టమైన అడవి నుంచి ఆహారం కోసం బయటికొచ్చిన యాన్ట్ ఈటర్ అనే జంతువు కస్తూరి నాయకన్‌పాళైయం నివాస ప్రాంతంలోకి ప్రవేశించింది. సమాచారం మేరకు వన్యప్రాణుల సంరక్షణ, రక్షణ బృందం అక్కడికి చేరుకుని దానిని పట్టుకున్నారు. తర్వాత మరుదమలై ఫారెస్ట్ గార్డ్ శరవణ కుమార్‌కు అప్పగించారు. దానికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని నిర్ధారించి దట్టమైన అడవిలో విడిపెట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.

బోనులో యాన్ట్ ఈటర్

పులిని పట్టుకోవడానికి అత్యాధునిక కెమెరాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మనుషులను చంపుతున్న పులిని పట్టుకోవడానికి అత్యాధునిక ఆటోమేటిక్ లైవ్ కెమెరాలను అటవీ శాఖ వారు ఏర్పాటు చేశారు. నీలగిరి జిల్లా గూడలూర్ సమీపంలోని ఓవేలి ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు పులి దాడిలో బలయ్యారు. దీంతో పులిని పట్టుకోవడానికి ఆదివారం పదో రోజుగా అటవీ శాఖవారు గాలింపు చర్యలు చేపట్టారు. దాని కదలికలు తెలుసుకునేందుకు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఆ మేరకు పులి సంచారం అధికంగా ఉన్నట్టు అనుమానిస్తున్న తేయాకు తోటల వద్ద అత్యాధునిక ఆటోమేటిక్ లైవ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని అటవీ శాఖాధికారుల మొబైల్‌ఫోన్లలోని ప్రత్యేక యాప్‌తో అనుసంధానించారు. తద్వారా పులి సంచార దృశ్యాలు నమోదైన వెంటనే హెచ్చరికలు అధికారులకు అందుతాయి.

ఓవేలి ప్రాంతంలో ఏర్పాటు చేసిన కెమెరా

ఆలయ వేడుకలో ముస్లిం ఎమ్మెల్యేకు గౌరవం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: హిందూ ఆలయ వేడుకలో టీవీకే ముస్లిం ఎమ్మెల్యే తాహిరాకు గౌరవం దక్కింది. రాణిపేట్టై జిల్లా మాందాంగల్ పంచాయతీ పరిధిలోని పెరియార్ మెమోరియల్ సమత్తువపురంలోని శ్రీ కెంగైయమ్మన్ ఆలయంలో మురుగన్, వినాయకుడి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం జరిగింది. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన టీవీకే రాణిపేట్టై ఎమ్మెల్యే తాహిరాను ఆ ప్రాంత మహిళలు సత్కరించారు. ఆమె చేతుల మీదుగా ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మెల్యే తాహిరాను సత్కరించిన మహిళలు

ఖాళీ స్థలంలో నాగుపాము గుడ్లు

బయటకొచ్చిన 39 పిల్లలు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మోర్ ఎతిరాజ్ కళాశాల వద్ద ఉన్న ఓ ఇంటి వెనుక వైపు ఖాళీ స్థలం నిరుపయోగంగా ఉంది. ఇదిలా ఉండగా సోమవారం మధ్యాహ్నం అక్కడ కొన్ని గుడ్డు పెంకులను చూసిన ఇంటి యజమాని అనుమానంతో అటవీశాఖ అధికారులకి సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు వచ్చి అవి పాము గుడ్లుగా నిర్ధారించారు. నాగుపాము 39 గుడ్లను పొదిగినట్లు గుర్తించారు. అందులో 19 పిల్లలు బయటకు వచ్చాయి. వాటిని చెంగల్పట్టు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. మిగిలిన 20 పిల్లల కోసం వెతుకుతున్నారు. సుమారు 10 రోజుల క్రితం ఆ ఇంట్లో భారీ నాగుపామును అటవీశాఖ సిబ్బంది పట్టుకున్న స్థితిలో ప్రస్తుతం ఆ పాము పిల్లలు గుడ్లలోంచి బయటకు వచ్చాయి.



బయటపడిన పిల్లలు

లెఫ్టినెంట్ జనరల్ వి.శ్రీహరి పదవీ విరమణ

వడపళని, న్యూస్‌టుడే: చెన్నైలోని దక్షిణ భారత్ ఏరియా భారత సైనిక ప్రధాన కార్యాలయం జనరల్ ఆఫీసర్ కమాండింగ్, లెఫ్టినెంట్ జనరల్ వి.శ్రీహరి సోమవారం పదవీ విరమణ పొందారు. తన వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఆయన వార్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛాలుంచి అమరవీరులకు ఘన నివాళులర్పించారు. 1987 జూన్ 16 సిఖ్ లైట్ ఇన్ఫాంట్రీలో నియమితులైన శ్రీహరి పారాచూట్ రెజిమెంట్(ప్రత్యేక దళాలు)లో చేరారు. సుమారు నాలుగు దశాబ్దాలపాటు పలు పదవులు నిర్వర్తించారు. శౌర్యచక్ర, సేనా పతకం, అతి విశిష్ట సేవా పతకం తదితర పురస్కారాలందుకున్నారు. 1977లో అమరావతి నగర్‌లోని సైనిక్ పాఠశాలలో విద్యార్థిగా రాణించి దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ స్థాయికి ఎదిగారు. శ్రీహరి, ఆయన కుటుంబానికి కార్యాలయ అధికారులు, జేసీఓలు, ఇతర విభాగ సిబ్బంది, సివిల్ స్టాఫ్ శుభాకాంక్షలు తెలిపారు.

వీడ్కోలు కార్యక్రమంలో అధికారులతో వి.శ్రీహరి, కుటుంబసభ్యులు

పరందూర్‌కు ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ?

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయ విస్తరణకు అక్కడికి సమీపంలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీని(ఓటీఏ)ని పరందూర్‌కు తరలించి రక్షణ మంత్రిత్వశాఖ నుంచి ఆ స్థలాన్ని పొందే విషయమై చర్చించినట్లు తెలిసింది. కాంచీపురం జిల్లా పరందూర్‌లో విమానాశ్రయ ప్రాజెక్టును ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పారిశ్రామిక రంగం, విమానాశ్రయాల అథారిటీ అధికారుల సమావేశం జరిగింది. ఈ విషయమై పారిశ్రామికరంగ వర్గాలు మాట్లాడుతూ చెన్నై మీనంబాక్కం విమానాశ్రయ 5వ టెర్మినల్‌ను పశ్చిమవైపు నిర్మించనున్నారు. దానిని తాంబరం-మదురవాయల్ రోడ్డుతో అనుసంధానించడానికి అప్రోచ్ రోడ్డు నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ పనుల అధ్యయనం కోసం త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని రహదారులు, జలవనరులు తదితర శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే జీఎస్టీ రోడ్డు ద్వారానే కాక తాంబరం- మదురవాయల్ రోడ్డు, కాంచీపురం, తిరువళ్లూర్, జిల్లాల నుంచి వచ్చే వారు కూడా నేరుగా విమానాశ్రయానికి చేరుకోగలుగుతారు. చెన్నై విమానాశ్రయం సమీపాన పరంగిమలైలో ఉన్న ఆర్మీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ 650 నుంచి 750 ఎకరాల్లో విస్తరించి ఉంది. రక్షణ మంత్రిత్వ శాఖను అభ్యర్థించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ భూమిని చెన్నై విమానాశ్రయ విస్తరణకు ఉపయోగించుకోవచ్చని చర్చించినట్లు సమాచారం. ఇప్పటి వరకు పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టు కోసం 1800 ఎకరాలు సేకరించారు. అక్కడ వెయ్యి ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఓటీఏ ఏర్పాటు చేసే విషయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. తద్వారా చెన్నై విమానాశ్రయ రెండో రన్‌వేను పూర్తిగా వినియోగించుకోవడానికి వీలుపడుతుంది. విమానాల రాకపోకల సంఖ్యను మూడు రెట్లు పెంచే అవకాశం కూడా ఉందని, ఇందుకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని పారిశ్రామికరంగ వర్గాలు తెలిపాయి.

డీఎండీకే కోశాధికారి, ఎంపీ ఎల్‌కే సుదీశ్ కుమార్తె వివాహ నిశ్చితార్థ కార్యక్రమం ఆదివారం రాత్రి చెన్నైలో జరిగింది. డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని కొత్త జంటను ఆశీర్వదించారు. ఆయనతో పాటు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, ఎంపీ కళానిధి వీరాసామి తదితరులు ఉన్నారు.

- ప్యారిస్, న్యూస్‌టుడే

కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాలి

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆర్ఎంకే విద్యాసంస్థల అధినేత ఆర్ఎస్ మునిరత్నం సూచించారు. తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం కవరప్పేటలోని ఆర్ఎండీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది చేరిన కొత్త విద్యార్థులకు ఆహ్వాన (ఫ్రెషర్స్ డే) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆర్ఎస్ మునిరత్నం అధ్యక్షత వహించి విద్యార్థులకు కోర్సులకు సంబంధించిన ఉపకరణాలున్న కిట్‌లు అందజేసి మాట్లాడారు. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తగ్గట్టు విద్యార్థులు తమను తాము సిద్ధం చేసుకోవాలన్నారు. కళాశాల ఉప ఛైర్మన్ కిశోర్, కార్యదర్శి ప్రదీప్, డైరెక్టర్ జ్యోతినాయుడు, టెక్నాలజీ విభాగ సలహాదారుడు జయప్రకాష్, సలహాదారులు మనోహరన్, పళనిస్వామి, ప్రిన్సిపల్ అన్బుసెళియన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కోర్సు కిట్లు అందజేస్తున్న ఆర్ఎస్ మునిరత్నం

నాలుగు రకాలుగా చెత్త విభజన

ధర్మపురి నగరపాలక సంస్థలో కొత్త విధానం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి నగరపాలక సంస్థ పరిధిలో చెత్తను నాలుగు రకాలుగా సేకరించే విధానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని నగరపాలికలు, పురపాలికలు, పట్టణ పంచాయతీలు తదితర స్థానిక సంస్థల్లో చాలాఏళ్లుగా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. గత కొన్నేళ్లగా ఆర్గానిక్, నాన్ ఆర్గానిక్ చెత్తను విభజించి సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఇందులో కూడా మార్పులు చేశారు. చెత్తను నాలుగు రకాలుగా విభజించి సేకరించే పద్ధతిని ప్రవేశపెట్టారు. ధర్మపురి జిల్లా కలెక్టర్ శరవణన్ ఉత్తర్వుల మేరకు ధర్మపురి నగరపాలక సంస్థ కమిషనర్ శేఖర్ సూచనతో ఈ కొత్త పద్ధతిని అమలుపరిచారు. నగరపాలక సంస్థలో ఉన్న 33 వార్డులలో అంచలంచలుగా చెత్తను నాలుగు రకాలుగా సేకరించాలని నిర్ణయించారు. ప్రయోగాత్మకంగా నిర్వహించిన పనులు విజయవంతమయ్యాయి. దీంతో మొదటి విడతగా 4, 10, 28, 31 వార్డులలో ఈ పద్ధతిని ప్రారంభించారు. దీని గురించి నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి రాజరత్నం మాట్లాడుతూ.. 33 వార్డులలో 22,558 గృహాలు, 7,001 వాణిజ్య సంస్థలున్నట్టు తెలిపారు. నీలి, పచ్చ, ఎరుపు, నలుపు చెత్త బుట్టలను అందజేసినట్టు వివరించారు. ఈ నెల 5వ తేదీ నుంచి వాణిజ్య సంస్థలలో అమలుపరుస్తామని తెలిపారు. చెత్త విభజించకుండా అందజేసిన సంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కొళత్తూర్' ఎన్నికల వ్యవహారంలో

స్టాలిన్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్యారిస్, న్యూస్‌టుడే: కొళత్తూర్ నియోజకవర్గ ఎన్నికల వ్యవహారమై మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును మద్రాస్ హైకోర్టు వాయిదా వేసింది. శాసనసభ ఎన్నికల్లో కొళత్తూర్ నుంచి టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు గెలుపొందారు. రెండో స్థానంలో నిలిచిన స్టాలిన్ ఇచ్చిన వినతిని స్వీకరించి ఆ నియోజకవర్గంలో 14 ఈవీఎంలు, వీవీపాట్లలో నమోదైన ఓట్లను సరిచూశారు. అక్రమాలు జరిగాయని స్టాలిన్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సరిచూసేందుకు తీసుకున్న కొన్ని ఈవీఎంలలో సాంకేతికలోపం ఏర్పడిందని, ఆరు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు, వీవీపాట్‌లను పోల్చి చూస్తే అవకతవకలు జరిగినట్లు తెలిసిందన్నారు. అన్ని ఓటింగ్ యంత్రాలు, వీవీపాట్‌లను సరిచూసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వీఎస్ బాబు గెలుపు చెల్లదని, తనను విజేతగా ప్రకటించాలన్నారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం విచారించింది. ఈవీఎంలు, వీవీపాట్‌లను సరిచూడాలని ఫలితాలు వెలువడిన మూడు రోజుల్లో వినతి ఇచ్చినట్లు, అయితే ఎన్నికల కేసు దాఖలుకు గడువుగా ఉన్న 45 రోజుల తర్వాతే వాటిని చూడటంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు స్టాలిన్ తరఫున వాదించారు. పిటిషనర్ కోరికలు విచారణకు తగినవి కావని, ఎమ్మెల్యే గెలుపు చెల్లదని ప్రకటించాలని ఎన్నికల కేసు మాత్రమే దాఖలు చేయడం కుదురుతుందని ఎన్నికల కమిషన్ తరఫున తెలిపారు. ఈ పిటిషన్ విచారణకు తీసుకుంటే ఇదే కోరికతో మరిన్ని దాఖలవుతాయని వాదించారు. అన్ని వాదనలు విన్న న్యాయమూర్తులు స్టాలిన్ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వాయిదా వేశారు.

డబ్బు తిరిగివ్వలేదని అంబులెన్స్‌లో వచ్చి మహిళ ఫిర్యాదు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తన వద్ద తీసుకున్న డబ్బు తిరిగివ్వలేదని బాధితురాలు అంబులెన్స్‌లో వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. చెన్నై పట్టాభిరామ్ అన్నానగర్ 8వ వీధిలో నివాసం ఉండే జయంతి రోడ్డు పక్కన చేపలు విక్రయిస్తుంటారు. వైద్య ఖర్చుల కోసం కొంత డబ్బు పొదుపుచేసింది. ఆమె పక్కింట్లో ఉండే తిరుమణి ఇల్లు కట్టుకోవడానికి జయంతి వద్ద డబ్బులు అడిగాడు. తన రెండు మూత్రపిండాలు పాడయ్యాయని, కిడ్నీ మార్పిడికి డబ్బులు అవసరమని చెప్పి డబ్బు ఇవ్వడానికి నిరాకరించింది. త్వరలో తిరిగిస్తానని పట్టుబడటంతో జయంతి రూ.4లక్షలు, ఆమె సోదరి పరిమళ ద్వారా రూ.6 లక్షలు కలిపి మొత్తంగా రూ.10 లక్షలు తిరుమణి ఇచ్చింది. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా తీసుకున్న డబ్బివ్వలేదు. పదేపదే అడగటంతో రూ.30 వేలు మాత్రమే ఇచ్చాడు. ఈ నేపథ్యంలో జయంతి, ఆమె సోదరి పట్టాభిరామ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డబ్బులు త్వరలో ఇస్తానని పోలీసులు తిరుమణిని పిలిపించి రాయించారు. ఆలస్యమవుతుండటంతో ఆవడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయంతిని ఆమె సోదరి సోమవారం అంబులెన్స్‌లో ఆవడి పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తీసుకొచ్చి తిరుమణిపై ఫిర్యాదు చేసింది.

మాట్లాడుతున్న జయంతి సోదరి పరిమళ

90శాతం దెబ్బతిన్న వేరుసెనగ పంట

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లాలో ఊత్తంగరై, పోచ్చంపల్లి తదితర గ్రామాల్లో రుతుపవనాల వర్షాన్ని నమ్ముకొని సుమారు 30 వేల ఎకరాలలో వేరుసెనగ సాగు చేశారు. అయితే ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో 90శాతం పంట దెబ్బతింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంగన్వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు

పుదువై మంత్రి శివకొళుందు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: అంగన్వాడీ పిల్లలకు ఏకరూప దుస్తులు(యూనిఫాం)అందిస్తామని పుదుచ్చేరి మంత్రి శివకొళుందు ప్రకటించారు. శాసనసభలో గ్రాంట్ల అభ్యర్థనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రానికి రంగుల పుస్తకాలు, పెన్సిళ్లు, జ్ఞాపకశక్తి పెంచే ఫ్లాష్‌కార్డులు, పోస్టర్లు తదితర విద్యాసామగ్రి కూడా అందిస్తామని చెప్పారు. 12 వేల మంది అంగన్వాడీ చిన్నారులకు రూ.60 లక్షల విలువైన రెండు జతల ఏకరూప దుస్తులు అందిస్తామన్నారు. ఉదయం అల్పాహారంగా రకరకాల పప్పుధాన్యాలు, రోజూ గుడ్లు ఇస్తామని తెలిపారు. రెండు నుంచి ఆరేళ్ల పిల్లలకు వారానికి రెండుసార్లు ఆయా కాలాల్లో లభించే పండ్లు, వారానికోసారి చిరుధాన్యాలతో తయారుచేసిన పోషక బిస్కెట్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. నెలవుల సమయంలో 65 రోజులు పౌష్టికాహారం అందిస్తామన్నారు. అంగన్వాడీలలో శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, తొలిదశగా తొమ్మిది ప్రాంతాల్లో ప్రారంభిస్తామన్నారు.

(c) eenadu

వచ్చేవారం పేర్ సొల్లుం పిళ్లై రెండో షెడ్యూల్

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళ చిత్రసీమలో ఎదుగుతున్న యువనటుల్లో ఒకరైన కవిన్ నటిస్తున్న 'పేర్ సొల్లుం పిళ్లై' చిత్రం రెండో విడత షూటింగ్ వచ్చే వారం మదురైలో ప్రారంభం కానుంది. ఇది కవిన్‌కు 10వ సినిమా. మొదటి విడత చిత్రీకరణ చెన్నై, చెంగల్పట్టు ప్రాంతాల్లో జరిగింది. 1987లో కమల్‌హాసన్ నటించి విజయం సాధించిన క్లాసిక్ సినిమా 'పేర్ సొల్లుం పిళ్లై' టైటిల్ ఈ కొత్త సినిమాకు పెట్టారు. పాత సినిమా పేరయినా చిత్రం సరికొత్తగా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. ఇందులో లబ్బర్ బంతు ఫేమ్ సంజన హీరోయిన్‌గా నటిస్తోంది. విలక్షణమైన నటనతో తమిళ చిత్రసీమపై తమదైన ముద్ర వేసిన కవిన్, సంజన జంటగా నటిస్తుండటంతో వారి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో అని సినీ అభిమానుల్లో ఉత్సుకత నెలకొంది.

పూజా కార్యక్రమంలో కవిన్, సంజన

వెండితెరపై కనిపించనున్న అమలా షాజీ

సైదాపేట: ప్రముఖ ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ అమలా షాజీ వెండితెరపై అరంగేట్రం చేయనుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో తన అభినయం, డ్యాన్సుల ద్వారా 4.2 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ సంపాదించుకున్న కేరళకు చెందిన అమలా షాజీ తమిళ చిత్రసీమలో అడుగుపెట్టనుంది. ప్రముఖ నటుడు విక్రమ్ ప్రభు 26వ సినిమాలో ముఖ్యపాత్ర పోషించనున్నారు. కొత్త దర్శకుడు సిద్ధార్థ్ దర్శకత్వం వహించనున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చనున్నారు. తన చాలా రోజుల కల ఫలించనుందని, ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాత, హీరోలకు కృతజ్ఞతలని ఆమె పేర్కొన్నారు.

లియో విజన్‌తో చేతులు కలిపిన నిత్యా మేనన్

సైదాపేట: 'నడువుల కొంచెం పక్కత్త కానోం', 'ఇదర్కుదానే ఆశపట్టాయ్ బాలకుమారా' తదితర సినిమాలను నిర్మించిన లియో విజన్ సంస్థతో నిత్యా మేనన్ చేతులు కలిపింది. 'ప్రొడక్షన్ నంబర్-5' అని తాత్కాలికంగా పేరు పెట్టిన సినిమాను లియో విజన్, నిత్యా మేనన్‌లకు చెందిన 'కేయురి ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దర్శకుడు డీకే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నిత్యా మేనన్ కథానాయిక. ఫాంటసీ, డార్క్ కామెడీ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రూపొందనుంది. సినిమా టైటిల్, ఇతర తారాగణం గురించి త్వరలో ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

జేసన్ సంజయ్ నటుడైతే బాగుండేది: సందీప్ కిషన్

సైదాపేట: జేసన్ సంజయ్ దర్శకత్వానికి బదులు నటన ఎంచుకుని ఉంటే మొదటి సినిమాతోనే దేశవ్యాప్తంగా బాక్సాఫీసును షేక్ చేసుండేవారని ప్రముఖ నటుడు సందీప్ కిషన్ తెలిపారు. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తనయుడు జేసన్ సంజయ్ 'సిగ్మా' చిత్రంతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. లైకా, జేఎస్‌జే మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. తమన్ స్వరాలు సమకూర్చనున్నారు. ఈ నేపథ్యంలో సందీప్ కిషన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... జేసన్ సంజయ్ నటనను ఎంచుకొని ఉంటే బాక్సాఫీసును షేక్ చేసుండేవారని తెలిపారు. అయితే దర్శకుడిగా తన ప్రతిభ చాటాలన్నదే జేసన్ కోరికని చెప్పారు.

సరదాగా ముచ్చటించుకుంటున్న సందీప్ కిషన్, జేసన్ సంజయ్ →

ప్రభు, విజయ్ వర్మ సినిమా చిత్రీకరణ ప్రారంభం

సైదాపేట: సీనియర్ నటుడు ప్రభు, విజయ్ వర్మ నటిస్తున్న కొత్త సినిమా చిత్రీకరణ సోమవారం ప్రారంభమైంది. డార్క్ హ్యూమర్ జానర్‌లో థ్రిల్లర్ కామెడీగా రూపొందనుంది. ఫ్రాంక్లిన్ జాకబ్ దర్శకత్వం వహిస్తున్నారు. రోమియో పిక్చర్స్ నిర్మిస్తోంది. మొదటి రోజు షూటింగ్ సమయంలో నటుడు విక్రమ్ ప్రభు, దర్శకుడు అదిక్ రవిచంద్రన్‌లు వచ్చి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ప్రభు తదితరులు

కాంచీపురంలో కొత్తగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి రోజు వెలువడే మురుగునీటిని శుద్ధి చేసి వేగవతి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఇందుకోసం తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి, జలవనరుల శాఖ నుంచి కార్పొరేషన్ అనుమతి కోరింది. ఈ క్రమంలో కాంచీపురం సమీపంలోని నత్తపేట ప్రాంతంలో సుమారు రూ.68 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణానికి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నగరంలో వెలువడే మురుగు నీటిని శుద్ధి చేయడానికి చాలాఏళ్ల క్రితం నత్తపేట చెరువు ప్రాంతంలో శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుని నీటిని పూర్తిగా శుద్ధి చేయలేకపోతోంది. ఫలితంగా శుద్ధి చేయని మురుగునీరు చెరువులో కలుస్తోందని, తద్వారా భూగర్భ జలాలు, వ్యవసాయ భూములు ప్రభావితం అవుతున్నాయని నత్తపేట ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కొత్తగా ప్లాంట్ నిర్మించాలని కార్పొరేషన్ నిర్ణయించింది.

ప్లాంట్ నమూనా

వీధి కుక్కల నియంత్రణకు కు.ని శస్త్రచికిత్సలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వీధి కుక్కల నియంత్రణకు ధర్మపురి జిల్లాలో 18,410 వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేపట్టాలని లక్ష్యం నిర్ణయించినట్టు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 33,664 వీధి శునకాలున్నాయి. రోజుకు సుమారు 25 మంది వీటి కాటుకి గురవుతున్నట్టు చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని సంథైపేట్టై ప్రాంతంలో సంతానోత్పత్తి నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరుపుతున్నారు. దీని గురించి అధికారులు మాట్లాడుతూ.. రోజుకు 20 నుంచి 25 వీధి శునకాలకు కు.ని శస్త్రచికిత్సలు జరుపుతున్నట్టు తెలిపారు. టీకాలు కూడా వేస్తున్నట్టు చెప్పారు. పట్టణ పంచాయతీలలో కూడా ఈ పథకాన్ని అమలుపరచడానికి చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. సుమారు 18,410 వీధి శునకాలకు కు.ని శస్త్రచికిత్సలు జరపాలని లక్ష్యం నిర్ణయించినట్టు వివరించారు.

తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ

తిరుమల, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఏడాది పొడవునా నిర్వహించే ఉత్సవాల్లో బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రధానమైనవి. అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను అలరించనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడోఏట అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం (భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం)లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ రెండు బ్రహ్మోత్సవాలకు పెద్దతేడా లేదుగానీ, నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ఈ ఏడాది అధికమాసం ఉన్న కారణంగా సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల (వార్షిక) బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహన సేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడ వాహనసేవ సాయంత్రం 6.30 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది.

శ్రీవారి ఆలయం (పాతచిత్రం)

అంకురార్పణం

వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజావాపనం అత్యంత ముఖ్యమైంది. కార్యక్రమం ఈనెల 14వ తేదీన రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య నిర్వహిస్తారు. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు దీనిని నిర్వహిస్తారు. శ్రీస్వామివారి సేనాధిపతి యైన శ్రీవిష్వక్సేనులవారు ఆలయానికి నైరుతి మూలలో ఉన్న వసంత మండపానికి ఊరేగింపుగా వెళతారు. అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి మన్నులో 9 రకాల ధాన్యాలను నాటుతారు. అంకురాలను ఆరోపింపజేసే ఈ కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణ అయింది.

ధ్వజారోహణం

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. ఈనెల 15వ తేదీ సాయంత్రం 6.21 నుంచి 6.35 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాయిద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. కార్యక్రమం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. అనంతరం వాహనసేవలు వైభవంగా ప్రారంభమవుతాయి.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీవారి బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం కోయిళ్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమం ఈనెల 8వ తేదీ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయంలోని ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణంలోని గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేస్తారు.

పురాణ నేపథ్యంలో ఇలా..

శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవున్ని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారనేది పురాణ కథనం. ఆ ప్రకారమే శ్రీవేంకటేశ్వరుడు ఆనంద నిలయం మధ్యలో ఆవిర్భవించిన కన్యామాసం (ఆశ్వయుజం)లోని శ్రవణా నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అందుకే ఇవి 'బ్రహ్మోత్సవాలు'గా ప్రసిద్ధిచెంది అప్పటి నుంచి నిరాటంకంగా కొనసాగుతున్నాయి.

శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం

తిరుమల: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, నారాయణగిరి షెడ్లలో వేచి ఉన్నారు. వీరికి 10 గంటల్లో, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో దర్శనం లభిస్తోంది. ఆదివారం 81,687 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.4.36 కోట్లు లభించాయి. తిరుపతిలో శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటలకు 10 వేల సమయ నిర్దేశ ఎస్‌ఎస్‌డీ టోకెన్లు జారీ చేశారు. వీరికి మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది.

భవన నిర్మాణ వ్యర్థాలతో భయాందోళన

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నదీ పరీవాహక ప్రాంతాలలో నిర్మాణ శిథిలాలు, వ్యర్థాలను పోస్తున్నందున ప్రకృతి విపత్తులు సంభవించే ప్రమాదం ఉందని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీలగిరి జిల్లా మంజూర్ సమీపంలోని గెత్తై మాయాజాల వంతెన కింద పోసిన నిర్మాణ వ్యర్థాల వల్ల వర్షపునీరు ప్రవహించే మార్గంలో అంతరాయం ఏర్పడింది. ఇటీవలి కాలంగా కున్నూర్‌లో హైకోర్టు ఉత్తర్వులను లెక్కచేయకుండా చిత్తడి నేలల్లో భవన నిర్మాణ వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో జలవనరులు ఉనికిని కోల్పోతున్నాయి. వర్షాకాలంలో అధిక స్థాయిలో నీరు ప్రవహించడానికి మార్గం లేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మంజూర్-కోవై సాలైలో గెత్తై సమీపంలోని మాయాజాల ప్రాంతంలోని వంతెన కింద కొందరు భవన నిర్మాణ వ్యర్థాలు పోయడంతో నీటి మార్గం మూసుకుపోయింది. సంబంధిత అధికారులు పరిశీలించి వ్యర్థాలు పోయకుండా చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రియులు కోరుతున్నారు.

వంతెన కింద పోసిన నిర్మాణ వ్యర్థాలు

కాంచీపురం ప్రభుత్వాస్పత్రిలో కృత్రిమ గర్భధారణ కేంద్రం

ఏర్పాటుకు సన్నాహాలు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం ప్రభుత్వ హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రిలో మొదటిసారిగా కృత్రిమ గర్భధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్సా విభాగాలతో పాటు 750 పడకల సౌకర్యం ఉంది. ప్రతిరోజు 3 వేల మందికి పైగా ఔట్ పేషెంట్లు వస్తుంటారు. ప్రసూతి సేవల్లో కూడా ముందంజలో ఉంది. ఈ క్రమంలో సంతానలేమి సమస్యలను పరిష్కరించడానికి కృత్రిమ గర్భధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా మంది పిల్లలు లేని మహిళలు చికిత్స కోసం చెంగల్పట్టు వైద్య కళాశాల ఆస్పత్రి, చెన్నై ఎగ్మోర్ ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కాంచీపురం ఆసుపత్రిలో కృత్రిమ గర్భధారణ కేంద్రాన్ని ప్రారంభిస్తే అలాంటి వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు యువకుల మృతి

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. ఈరోడ్ జిల్లాకు చెందిన దర్శన్(21), వినీష్(21), మదురైకు చెందిన దురై పాండియన్(25), కడలూర్‌కు చెందిన యువరాజ్(26) ఒరగడం సమీపంలోని వల్లకోట ప్రాంతంలో అద్దె గదుల్లో ఉంటూ స్థానికంగా ఉన్న వివిధ ప్రైవేట్ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా దర్శన్, వినీష్ ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై శ్రీపెరుంబుదూర్-సింగపెరుమాళ్ కోవిల్ హైవేపై వెళుతుండగా అదే సమయంలో దురైపాండియన్, యువరాజ్ ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చారు. ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో నలుగురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని అంబులెన్స్ ద్వారా శ్రీపెరుంబుదూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దురై పాండియన్, యువరాజ్ మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం చెంగల్పట్టు ఆసుపత్రికి దర్శన్‌ను, వినీష్‌ను తరలించగా అక్కడ దర్శన్ మృతి చెందాడు. వినీష్ పరిస్థితి విషమంగా ఉంది. ఘటనపై ఒరగడం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నీళ్ల బకెట్‌లో పడి చిన్నారి...

రెడ్‌హిల్స్: తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ సమీపం కన్నప్పస్వామినగర్‌కు చెందిన ప్రకాష్, సుమిత్ర దంపతులు. వీరి కుమార్తె యోగమాయ(1) శనివారం రాత్రి ఇంట్లో ఆడుకుంటుండగా నీళ్ల బకెట్‌లో పడి ఊపిరాడక మృతి చెందింది. పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగమాయ (పాతచిత్రం)

క్రికెట్ బంతి తలకు తగిలి 11 ఏళ్ల బాలుడు...

కాంచీపురం: కాంచీపురం కలెక్టర్ కార్యాలయానికి వెనుక ఉన్న ఎన్జీవో నగర్ ప్రాంతానికి చెందిన సుకీర్తలక్ష్మి కుమారుడు సాయి మోతీశ్వరన్(11). ఇతను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 26వ తేదీ పాఠశాలకు సెలవు కావడంతో కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న క్రీడా మైదానంలో క్రికెట్ ఆడటానికి వెళ్లాడు. మైదానంలో చాలా మంది క్రికెట్ ఆడుతుండగా ఓ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన బంతి సాయి మోతీశ్వరన్ తలకు బలంగా తాకింది. దీంతో స్పృహకోల్పోయాడు. తోటివారు వెంటనే అంబులెన్స్‌లో కాంచీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వేలూర్ బస్టాండ్‌లో వ్యక్తి...

వేలూర్: వేలూర్ జిల్లా గుడియాత్తం సమీపంలోని రామాలై గ్రామానికి చెందిన దైవం(57) అనే వ్యక్తికి మూత్రపిండంలో క్యాన్సర్ కణితి ఉంది. సోమవారం ఉదయం భార్య ధనలక్ష్మీతో కలిసి కాంచీపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లడానికి వేలూర్ కొత్త బస్టాండుకి చేరుకున్నారు. అప్పుడు కణితి పగిలిపోవడంతో రక్తస్రావమైంది. సమాచారం మేరకు అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. తర్వాత వేలూర్ నార్త్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

నీళ్లట్యాంకులో మహిళ మృతదేహం లభ్యం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: సేలం జిల్లా అరిసిపాళైయంలో ఆలయ పూజారి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కుళాయిల్లో వస్తున్న నీరు కొన్ని రోజులుగా దుర్వాసన వస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఇంటి యజమాని మేడపై ఉన్న నీళ్లట్యాంకు మూత తీసి చూశారు. అందులో ఓ మూట కనిపించడంతో చెవ్వాపేట్టై పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మూటను బయటకు తీసి చూడగా మహిళ మృతదేహం ముక్కలుగా నరికిన స్థితితో కుళ్లిపోయి కనిపించింది. తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మహిళ వివరాలు తెలియలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళ గొంతు కోసి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తాంబరం సమీపంలోని చిట్లపాక్కం సోమసుందరం వీధికి చెందిన శివ(19) పొత్తేరిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఇతను ఆదివారం మధ్యాహ్నం తన ఇంటికి ఎదురుగా ఉన్న క్వార్టర్స్‌కు వెళ్లాడు. అక్కడ ఉన్న మహిళను తాగునీరు అడిగాడు. ఆమె తీసుకొచ్చి ఇచ్చింది. ఈ క్రమంలో శివ ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో కత్తితో గొంతు కోశాడు. వెంటనే అతను కూడా గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు ఇద్దరిని తాంబరం హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రికి తరలించారు. చిట్లపాక్కం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా తిరుచెంగోడు సమీపంలోని ఆరుముగత్తాన్‌కుట్టై ప్రాంతానికి చెందిన నిత్యానందం(41), తేన్‌తమిళ్‌సెల్వి(39) దంపతులు. వీరి మధ్య ఈ నెల 29వ తేదీ సాయంత్రం గొడవ జరిగింది. ఆదివారం వేకువజామున పడక గదిలో నిత్యానందం ఫ్యానుకు ఉరేసుకున్నాడు. చూసిన భార్య కూడా హాల్‌లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తిరుచెంగోడు పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

కొత్తగా పెళ్లైన యువకుడు...

గిండి: నాగపట్టినం జిల్లా పాల్‌పన్నైచేరి మారియమ్మ ఆలయ వీధికి చెందిన నెడుంచెళియన్ కుమారుడు గజేంద్రన్(26) డ్రైవర్. ఇతనికి నాలుగు నెలల క్రితం వివాహమైంది. ఆదివారం ఇతని సోదరికి పెళ్లి జరుగనుండగా ఆదివారం రాత్రి గజేంద్రన్‌కు భార్యతో గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన అతను గదిలోకెళ్లి తలుపు వేసుకున్నాడు. సోమవారం ఉదయం భార్య వెళ్లి చూడగా గజేంద్రన్ ఫ్యానుకు ఉరేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం మేరకు నాగూర్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో వ్యవసాయ కూలీ అరెస్టు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా తిరునింద్రవూరు సమీపం కొసవన్‌పాళ్యానికి చెందిన అరుణ్‌కుమార్ వ్యవసాయ కూలీ. ఇతను అదే ప్రాంతానికి చెందిన 14ఏళ్ల బాలికను లైంగికంగా వేధించినట్లు పట్టాభిరామ్ మహిళా పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ ధనమ్మాళ్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని పోక్సో చట్టం కింద సోమవారం అరెస్టు చేశారు.

ప్రమాదకరంగా ద్విచక్ర వాహనాలు నడిపిన నలుగురు...

ప్యారిస్: చెన్నై అరుంబాక్కం 100 అడుగుల రోడ్డులో కొంతమంది అతివేగంగా, ప్రమాదకరంగా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ద్విచక్ర వాహనాలు నడిపారు. ఈ విషయమై అన్నానగర్ ట్రాఫిక్ ఇంటెలిజెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదిత్య, సెంతమిళ్‌సెల్వన్, రాహుల్, అజయ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. ఆరుగురు బాలురను కోర్టులో హాజరుపరచి జువైనల్ హోంకి తరలించారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి...

తిరుత్తణి: తిరుత్తణి నగరంలోని పలు ప్రాంతాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఆ మేరకు తిరుత్తణి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. బాలాజీ నగర్‌కి చెందిన వెంకటేశన్(47) మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. 28 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

వెంకటేశన్

విద్యార్థిని బలవన్మరణం వ్యవహారం ప్రధానోపాధ్యాయినిపై కేసు నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న వ్యవహారంలో ప్రధానోపాధ్యాయినిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపంలోని తొట్టప్పనాయక్కనూర్‌కి చెందిన విద్యార్థిని పదో తరగతిలో మంచి మార్కులు సాధించి, పూచ్చిపట్టిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌వన్‌లో చేరింది. పాఠశాలకు కొన్ని రోజులు వెళ్లిన బాలిక తర్వాత మానేసింది. దీంతో ప్రధానోపాధ్యాయుడు విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. టీసీ తీసుకొని మరో పాఠశాలలో చేర్పించాలని చెప్పినట్లు తెలుస్తోంది. అనంతరం ఉసిలంపట్టి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఆమె తల్లి పాఠశాలకు వెళ్లింది. అప్పుడు ప్రధానోపాధ్యాయిని వద్ద ఆమె చేతులు కట్టుకొని నిలబడి మాట్లాడుతుండగా బాలిక అలా నిల్చోవద్దని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రధానోపాధ్యాయిని ఆగ్రహం వ్యక్తం చేసి దుర్భాషలాడటంతో బాలిక బయటకు పరుగులు తీసి సుమారు 5 కి.మీ వెళ్లింది. తల్లి వెతుక్కుంటూ వెళ్లి కుమార్తెను ఇంటికి తీసుకెళ్లింది. ఆ రోజు రాత్రి భోజనం చేయకుండా బాలిక బాధపడింది. మరుసటి రోజు చదివిన పాఠశాల నుంచి తల్లి టీసీ తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మొదట అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం ఆమె తల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి అనుచితంగా ప్రవర్తించిన పాఠశాల ప్రధానోపాధ్యాయిని విమలాదేవిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య కేసు గిండి ఆర్డీవో దర్యాప్తు

మామల్లపురం, న్యూస్‌టుడే: చెన్నై సమీపం కోవిలంబాక్కం ఎస్.కొలత్తూర్ పిళ్లయార్ కోవిల్ క్రాస్ వీధిలో జగన్నాథన్ కుటుంబం నివసిస్తోంది. ఆయన రెండో కుమార్తె భువనేశ్వరి(27) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. 2024లో చెంగల్పట్టు జిల్లా ఈచ్చంగరణైకు చెందిన జానకిరామన్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో వధువుకి 50 సవర్లు, వరుడికి 20 సవర్ల బంగారు నగలు, రూ.15 లక్షల విలువైన కారు, గృహోపకరణాలు కట్నంగా ఇచ్చారు. ఇదిలా ఉండగా కొన్ని నెలలకు భర్త, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం భువనేశ్వరిని వేధించారు. వీరికి ప్రస్తుతం ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. బాలుడి మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు ఒకటిన్నర సవర్ల బంగారు గొలుసును బహుమతిగా ఇచ్చారు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగస్టు 20వ తేదీ గుడిలో శుభకార్యం నిమిత్తం భువనేశ్వరి పుట్టింటికి వచ్చింది. ఆ సమయంలో ఆమెతో ఫోన్‌లో మాట్లాడిన భర్త.. మళ్లీ ఇంటికి రావద్దని, పుట్టింట్లోనే ఉండాలని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన భువనేశ్వరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో పళ్లిక్కరణై పోలీసులు కేసు నమోదు చేశారు. పెళ్లై రెండేళ్లే కావడంతో ఈ కేసును గిండి ఆర్డీవో దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల కోసం గాలింపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి వన్యప్రాణుల వేట నియంత్రణ విభాగానికి అందిన సమాచారం మేరకు కృష్ణగిరి జిల్లా హోసూర్ అటవీ సర్కిల్ అధికారి జయరాజ్ తన సిబ్బందితో శూలగిరి సర్కిల్ నెరిగం పంచాయతీ కరియచందరం గ్రామంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మూడు ఉడుములు, జింక కొమ్ము, నాటు తుపాకీ, రెండు రకాల పక్షులను స్వాధీనం చేసుకున్నారు. సుబ్రమణి, మాది, రామదాస్ అనే వ్యక్తులు వేటాడి తీసుకొచ్చినట్లు గుర్తించారు. వారి కోసం గాలిస్తున్నారు.

నటుడి కారు అద్దాలు పగులగొట్టి చోరీ

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై మైలాపూర్‌కి చెందిన జయేంద్రన్ వరుణ్ సినీనటుడు. ఆయన సినీ నిర్మాత ఐసరి గణేష్ మేనల్లుడు. ఇదిలా ఉండగా ఆయన తన ఇంటి ముందు కారు నిలిపారు. గుర్తు తెలియని వ్యక్తి కారు అద్దాలు పగులగొట్టి లోపలున్న రూ.85 వేల నగదు, బంగారు నగలు, ఐఫోన్, ఖరీదైన చేతి గడియారం మొదలైన వాటిని చోరీ చేశాడు. జయేంద్రన్ వరుణ్ ఫిర్యాదు మేరకు మైలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వన్నారపేటకి చెందిన జలాలుద్దీన్‌ని సోమవారం అరెస్టు చేశారు.

క్రైం కార్నర్

కోవైలో రూ.10కోట్ల విలువైన మత్తుపదార్థం స్వాధీనం: ముగ్గురి అరెస్టు

అరెస్టైన నిందితులు

కోయంబత్తూర్, న్యూస్‌టుడే: కేరళం పోలీసులు కోయంబత్తూర్‌లో నిర్వహించిన డ్రగ్స్ నివారణ చర్యల్లో భాగంగా రూ.10 కోట్ల విలువైన 12.80 కిలోల ఎండీఎంఏ మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... కేరళం పోలీసులు జరిపిన దర్యాప్తు ఆధారంగా కోయంబత్తూర్ నగరంలో దాడులు నిర్వహించారు. ఇందులో 12.80 కిలోల ఎండీఎంఏ మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.10 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇందుకు సంబంధించి మహమ్మద్ జహీర్, జాబిర్ అలీ, షయామ్ అక్బర్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu